సాక్షి
అనకాపల్లి
శుక్రవారం, 17, మే, 2024



విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవల్లో భాగం స్వర్ణ పుష్పార్చన వైభవంగా విర్వహించారు.



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.3/26.0
వర్షం 10.5 మి.మీ

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

19న మోదకొండమ్మ పండగకు చాటింపు



మాడుగుల: ఈనెల 19వ తేదీన ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగకు చాటింపు జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు చెప్పారు. 21వ తేదీన అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను అమ్మవారి ఆలయం నుంచి కోట ప్రాంగణంలో ఉన్న సతకంపట్టు వరకు ఊరేగింపుగా తీసుకువస్తారన్నారు. వచ్చే నెల 18 వరకు అమ్మవారు సతకంపట్టు వద్ద కొలువు దీరి భక్తులకు దర్శనమిస్తారన్నారు. జూన్ 18న పండగ నిర్వహించాక తిరిగి ఘటాలు ఆలయానికి చేరడంతో అమ్మవారి నెల రోజుల పండగ ముగుస్తుందన్నారు.

45 రోజుల్లో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు ఎగుమతి

- విశాఖ పోర్టు రికార్డు



విశాఖపట్నం పోర్టు

సాక్షి, విశాఖపట్నం: సరుకు హ్యాండ్లింగ్‌లో మేజర్ పోర్టులతో పోటీ పడుతూ నంబర్ వన్ దిశగా అడుగులు వేస్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) మరో మైలురాయిని అధిగమించింది. కేవలం 45 రోజుల్లోనే 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు ఎగుమతి, దిగుమతులు నిర్వహించి రికార్డు సృష్టించింది. 2024-25లో శరవేగంగా సరకు హ్యాండ్లింగ్ నిర్వహణ కొనసాగుతోందని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 90 ఎంఎంటీ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వెల్లడించారు. 2023-24లో 10 ఎంఎంటీకి 47 రోజులు పట్టగా.. ఈసారి రెండు రోజుల ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్నట్లు చైర్మన్ వివరించారు.

మాజీ వలంటీరుపై దాడి కేసులో పది మంది అరెస్టు

- పూచీకత్తులపై స్టేషన్ బెయిల్ మంజూరు

నర్సీపట్నం: ధర్మసాగరం మాజీ వలంటీరు రాజకుమారిపై దాడికి పాల్పడిన కేసులో పది మంది టీడీపీ కార్యకర్తలను అరెస్టు చేశామని రూరల్ ఎస్సై భీమరాజు గురువారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... రాజకుమారి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పని చేశారు. పోలింగ్ రోజు ఆమె చురుగ్గా వ్యవహరించారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ మూకలు రాత్రి సమయంలో ఆమె ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. జుత్తు పట్టుకొని బయటకు ఈడ్చుకొచ్చి కాళ్లతో తన్నుతూ.. అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో దాడి ఘటన రుజువు కావడంతో రెడ్డి రాజేష్, రెడ్డి సాయి, అల్లు రాజు, సుకల రాజేష్, కామిరెడ్డి శివ, నందిపల్లి బోయిలనాయుడు, వానపల్లి రాజేష్, పెట్ల గంగాధర్, సుర్ల రఘులతోపాటు మరొకరిని అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తులపై వీరికి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

- జిల్లాలో 74,330 హెక్టార్లలో సాగు లక్ష్యం
- వరిదే అగ్రస్థానం
- అనుకూలిస్తున్న వాతావరణం
- ముందస్తు వర్షాలతో హర్షాతిరేకం
- దుక్కులకు సిద్ధమవుతున్న రైతులు
- రైతు భరోసా కేంద్రాలకు చేరిన విత్తనాలు



పొలం దున్నుతున్న రైతు

యలమంచిలి రూరల్: ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయశాఖ సిద్ధమైంది. 2024 వానాకాలం సాగు అంచనాను జిల్లా వ్యవసాయశాఖ ఖరారు చేసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం ఏ పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేయవచ్చన్న అంచనాలతో సాగు ప్రణాళికను రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 74,330 హెక్టార్లలో (1,85,825 ఎకరాలు) వివిధ రకాల పంటలను రైతాంగం సాగు చేయనుందని అంచనా వేస్తోంది. గత ఖరీఫ్‌తో పోల్చితే ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరగనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వాతావరణం అనుకూలించడంతో ఖరీఫ్‌కు రైతులు కూడా కోటి ఆశలతో సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే అదనుకు తగ్గట్టు వర్షాలు కురుస్తుండటంతో దుక్కులు చేస్తున్నారు. ప్రభుత్వం ముందుగానే రైతులకు అవసరమైన విత్తనాలను రైతుభరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. ఎరువుల సరఫరాపై కూడా అధికారులు దృష్టి పెట్టారు. వాతావరణశాఖ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పడంతో ఖరీఫ్ సాగు జోరుగా సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

మే నెలలో మొదలైన వర్షాలు

జిల్లాలో ఈ నెలలోనే వర్షాలు మొదలయ్యాయి. వర్షాలు ఆశాజనకంగా కనిపిస్తుండడంతో పలు ప్రాంతాల్లో అన్నదాతలు సాగు పనులను మొదలుపెట్టారు. ఇప్పటికే కొందరు వేసవి దుక్కులు దున్నడంతోపాటు తొలకరి పలకరించిన వెంటనే విత్తనాలు వేసేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు 2024 ఖరీఫ్ సాగు ప్రణాళికలను రైతు భరోసా కేంద్రాల వారీగా సిద్ధం చేశారు. పంటల ప్రణాళికలో వివరాల ప్రకారం జిల్లాలో అధికశాతం రైతాంగం వరి సాగుపైనే మొగ్గు చూపుతున్నారు. మొత్తం 1,41,250 ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. జొన్నలు 2250 ఎకరాలు, మొక్కజొన్న 200, రాగులు 50, చిరుధాన్యాలు 12.5 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. ముతకధాన్యాల్లో కందులు 450 ఎకరాలు, పెసర 625, మినుములు 625, అనుములు 175 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇవి కాకుండా వేరుశనగ 250 ఎకరాలు, నువ్వులు 2125, పత్తి 375, పొగాకు 12.5, చెరకు 37,500 ఎకరాల్లో సాగు చేయనున్నారు. సాగు ప్రణాళికకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ప్రభుత్వం ముందుగానే ఆర్బీకేలకు సరఫరా చేసింది. మరో వారం రోజుల్లో విత్తనాల పంపిణీ మొదలు పెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సాగు సమయానికి ముందే ఏటా రైతుల ఖాతాల్లో రైతు భరోసా కింద రూ.5,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని జమ చేస్తోంది. అయితే ఈసారి ఎన్నికల నేపథ్యంలో ఈ నిధుల విడుదలను ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి అడ్డుకున్నాయి. ఎన్నికలు పూర్తవడంతో ఇప్పటికైనా పెట్టుబడి సాయం నిధులు విడుదల చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. కొద్ది రోజుల్లో ఈ నిధులు జమ అయ్యే అవకాశం ఉంది.

విత్తనాల కొరత లేకుండా చూస్తాం



వానాకాలం సాగయ్యే పంటలకు కావాల్సిన విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. జిల్లాలో పంటల సాగును అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాం. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు నష్టపోవద్దు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయడానికి కార్యాచరణ రూపొందించాం. రైతు భరోసా కేంద్రాల సేవలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి.

–బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

అరకు కాఫీ..
మేడిన్ ఆంధ్ర పేరిట త్వరలో సాచెట్స్, టిన్స్ విడుదల
8లో

ఐఏసీ బాహుబలి విశాల్

- భారత మూడో ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్ 'ఐఎన్ఎస్ విశాల్'
- రూ.50 వేల కోట్లతో నిర్మాణం.. 2030 కల్లా అందుబాటులోకి..
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారీకి ప్రణాళికలు



సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో బలీయమైన శక్తిగా ఎదిగేందుకు భారత్ వినూత్న వ్యూహాలతో దూసుకువెళుతోంది. యుద్ధ విమాన వాహక నౌకల విషయంలో వెనుకబడి ఉన్న భారత్..ఆ లోటును భర్తీ చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్ల విషయంలో చైనా దూకుడుగా ఉన్న నేపథ్యంలో ఐఎన్ఎస్ విక్రాంత్ మాదిరిగా..మరో షిప్ ఐఎన్ఎస్ విశాల్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసేందుకు ప్రణాళికలు రచించింది. దీంతోపాటు మరో 3 ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్ (ఐఏసీ)లు రూపొందించేందుకు విధివిధానాల్ని రక్షణ శాఖ నిర్ణయించింది. రక్షణ వ్యవస్థకు ఎన్నడూ లేని విధంగా కేంద్రం బడ్జెట్ కేటాయిస్తున్న నేపథ్యంలో..అధునాతన ఆయుధ, నౌకా సంపత్తిని సొంతం చేసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. మూడో, అతి పెద్ద ఐఏసీకి సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. భారత నౌకాదళం ప్రస్తుతం ఉన్న **ఐఏసీ-2 విక్రాంత్ కంటే పెద్దదిగా** ఉండే మూడో **స్వదేశీ విమాన వాహక నౌక కోసం** అధ్యయనం పూర్తయింది. ప్రస్తుతం ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లు సేవలందిస్తున్నాయి. విక్రమాదిత్య జీవితకాలం మరో నాలుగేళ్లలో ముగిసే అవకాశం ఉండటంతో ఈలోగా కొత్త ఐఏసీని అందుబాటులోకి తీసుకురావాలని నేవీ అధికారులు భావిస్తున్నారు.

విక్రాంత్ కంటే భారీగా..

తదుపరి నిర్మించబోయే యుద్ధ విమాన వాహక నౌక.. దేశంలోనే అతిపెద్ద ఐఏసీగా నిర్మించాలని నేవీ నిర్ణయించింది. దీనికి ఐఎన్ఎస్ విశాల్‌గా నామకరణం చేసింది. ప్రస్తుతం ఉన్న విక్రాంత్ పరిమాణం 44,000 టన్నులు కాగా.. మూడో నౌక విశాల్‌ని 65,000 టన్నుల వరకు నిర్మించాలని భావిస్తోంది. కొత్త సాంకేతికతలతో కూడిన కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కాటాపుల్ట్ సిస్టమ్ (హైడ్రాలిక్‌తో నడిచే) ద్వారా ల్యాండింగ్ అయ్యే విధంగా నౌకా నిర్మాణ సౌకర్యాన్ని అప్‌గ్రేడ్ చేయనుంది. విక్రాంత్‌ని తయారు చేసిన కొచ్చి షిప్‌యార్డులోనే విశాల్‌ని తీర్చిదిద్దేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి రూ.50 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. జూలై తర్వాత విశాల్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

చైనాకు దీటుగా..

హిందూ మహాసముద్రంలో చైనా కవ్వింపు చర్యలు దేశ రక్షణ వ్యవస్థకు కంటగింపుగా మారుతున్న నేపథ్యంలో వైమానిక శక్తిని ఒకవైపు మలక్కా జలసంధి, మరోవైపు ఎడెన్ గల్ఫ్ వంటి సుదూర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరముంది. ఈ తరుణంలో ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లని అన్ని వైపులా మోహరించాల్సి ఉంటుంది. పశ్చిమ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న విక్రమాదిత్యని, తూర్పు తీరంలో గస్తీ కాస్తున్న విక్రాంత్‌ని మలక్కా, ఎడెన్ ప్రాంతాల్లో మోహరింపజేస్తే..భారత సముద్ర జలాల్లో మరో ఐఏసీ అవసరమవుతుంది. అందుకే..కొత్త షిప్‌ని నిర్మించాల్సి ఉంటుందని నేవీ భావిస్తోంది. చైనా అమ్ముల పొదిలో లియానింగ్, షాన్‌డాంగ్ అనే ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్స్ ఉన్నాయి. మూడో కేరియర్ ఫుజియాన్ సీ ట్రయల్స్ కూడా పూర్తి చేసుకుంది. ఇది యూకే, ఫ్రాన్స్, భారత్‌లో ఉన్న ఐఏఎఫ్‌ల కంటే అతి పెద్దది.

ఈ క్రమంలో భారత్ కూడా మరో ఐఏఎఫ్ కోసం సిద్ధమవుతోంది. 2030 కల్లా విశాల్‌ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మరోమారు ముఖ్యమంత్రి కావడం తథ్యమని, సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా నమోదైన పోలింగ్ శాతమే వైఎస్సార్‌సీపీ విజయానికి సంకేతమని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం తారువలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా తనను, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు అహర్నిశలు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో తనను ఆదరించి ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీకే రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఉన్నాయని, ఓటింగ్‌కు పెద్దఎత్తున తరలి రావడమే ఇందుకు నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్ఎస్‌టీఎల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ద్వితీయ బహుమతి





ప్రశంసా పత్రం అందుకుంటున్న ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ విద్యార్థులు

- పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

కశింకోట: ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల మొదటి ఏడాది ఈఈఈ బ్రాంచ్ విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో తమ ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానం పొందారు. నేవల్ టెక్నాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఆర్‌డీవో ఆధ్వర్యంలో విశాఖలోని నేషనల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) ఈ ప్రదర్శన నిర్వహించింది. ఎగ్జిబిషన్‌లో స్థానిక పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన డ్రైవర్ యాంటీ స్లీప్ డిటెక్టర్ ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం లభించిందని, ఈ మేరకు ప్రశంసా పత్రం లభించినట్లు ప్రిన్సిపాల్ శివ తెలిపారు. విద్యార్థులు, గైడ్ అధ్యాపకుడు బి.ఎస్.వి.నగేష్‌లను గురువారం కళాశాల యాజమాన్యం, శివ అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రధానం





అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, హాజరైన అధికారులు

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్న నిర్లక్ష్యం వద్దని, పల్లెలు, పట్టణాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని అధికారులకు సూచించారు. ఈ నెల 13న నిర్వహించిన ఎన్నికల తర్వాత జరిగిన సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై విశాఖ రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులతో విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం, జూమ్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా రేంజ్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడం వల్ల చిన్నచిన్న సంఘటనలు మినహా ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకోగలిగామన్నారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. మరో 15 రోజులు ప్రతిఒక్కరూ ఇదే నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, మన ప్రాంతంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత గ్రామాల్లో చిన్నచిన్న సంఘటనలు జరిగిన గ్రామాల్లో పర్యటించాలన్నారు. గ్రామస్తులతో మాట్లాడి వివాదాలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో రాజకీయంగా వివాదాలు సృష్టించే వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అవసరమైతే పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులను గుర్తించి, వారు గ్రామానికి ఏ పనిమీద వచ్చారు, ఎందుకు వచ్చారన్న విషయం తెలుసుకోవాలని, ఆయా అంశాలను పాయింట్ బుక్‌లలో నమోదుచేయాలని ఆదేశించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటుచేసినట్లు విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతరం అధికారుల తనిఖీలు చేపట్టి, భద్రతను పర్యవేక్షించాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, వాటిని జిల్లా ఎస్పీలు ముందుగానే సమీక్షించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల ఎస్పీలు ఎం.దీపిక, విక్రాంత్ పాటిల్, జి.ఆర్.రాధిక, కె.వి.మురళీకృష్ణ, తుహిన్ సిన్హా, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అదనపు ఎస్పీలు అస్మా ఫర్హీన్, ప్రేమ్‌కాజల్, దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షరోన్, ట్రెయినీ ఐపీఎస్ ఎం.జావలి, డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, ఆర్.గోవిందరావు, ఎ.ఎస్.చక్రవర్తి, జి.మురళీధర్, జి.వి.కృష్ణారావు, ఎస్.అప్పలరాజు, బి.అప్పారావు, కె.వి.సత్యనారాయణ, డి.బాలచంద్రారెడ్డి, వై.సునీత, జి.నాగేశ్వర రెడ్డి, ట్రైనీ డీఎస్పీలు ఎస్.మహేంద్ర, సీహెచ్.రాజా, పలువురు సీఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

త్వరలో తాండవ పూడికతీత

- ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రారంభం
- రెండు జిల్లాల్లో 32 పనులకు రూ.6.5 కోట్లు మంజూరు
- ఇప్పటికే ఆరు పనులకు టెండర్ల ఖరారు
- 120 కిలోమీటర్ల పొడవున కాలువల మరమ్మతులు



ఎడమ కాలువలో పేరుకుపోయిన పూడిక

నాతవరం: తాండవ ప్రాజెక్టు ఆయకట్టు సాగునీటికి ఇబ్బంది లేకుండా ఇరిగేషన్ శాఖ చర్యలకు ఉపక్రమించింది. మరో రెండు వారాల్లో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పూడికతీత పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువలో పూడికతీతతోపాటు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం 32 పనులకుగాను రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. ముందుగా ఇరిగేషన్ శాఖ అధికారులు ఆరు పనులకు టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టరుతో ఒప్పందం చేసుకున్నారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడా పనులు ప్రారంభించే అవకాశం లేకపోయింది.

ఎన్నికల కోడ్ వల్లే ఆగిన పనులు

తాండవ రిజర్వాయరు ఆయకట్టు అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఏటా తాండవ కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులను ఏప్రిల్, మే నెలలో చేస్తుంటారు. ఈ ఏడాది కాలువలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు కొత్తగా ఉపాధి హామీ పథకం నిధులతో కూలీలతో మట్టి పనులు చేసేందుకు కలెక్టరు ప్రత్యేకంగా అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు ఏపీవో చిన్నారావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో మట్టి పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఉపాధి కూలీలతో సైతం పనులు చేయడానికి అవకాశం లేకపోయింది.

శివారు ఆయకట్టుకు సాగునీరుపై మల్లగుల్లాలు..

తాండవ రిజర్వాయరు నీరు ఆధారంగా రెండు జిల్లాల పరిధిలో నాతవరం, నర్సీపట్నం, కోటనందూరు, కోటవురట్ల, పాయకరావుపేట, రౌతులపూడి, శంఖవరం, తుని మండలాల పరిధిలో 52 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు చేస్తుంటారు. ఆయా మండలాల పరిధిలో పెద్దా చిన్న కాలువలు కలుపుకుని 120 కిలోమీటర్ల పొడవున కుడి, ఎడమ కాలువలు ఉన్నాయి. ఆయా కాలువల్లో ఏటా పూడిక తీస్తుంటారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో పూడిక తీత పనులు చేయలేదు. దాంతో శివారు ఆయకట్టుకు సాగు నీరు ప్రవహించదని ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల కోడ్ ముగిసాక పూడిక తీత పనులు చేద్దామన్నా వర్షాలు కురవడం వల్ల ఆటంకం కానుంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు సాగునీరు ఎలా అందించాలన్న దానిపై ఇరిగేషన్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

తాండవ గేట్ల మరమ్మతులకు రూ.9 లక్షలు సిద్ధం

తాండవ రిజర్వాయరు ప్రధాన గేట్లు మరమ్మతులు చేపట్టడం కోసం గతంలో ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తంతో గేట్ల వద్ద లీకేజీ నీరు అరికట్టేందుకు టెండర్లు ఆహ్వానించారు. ఇంతలో ఎన్నికలు కోడ్ రావడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వెంటనే పని పూర్తి చేయకపోవడంతో ఆ నిధులు వృథాగా ఉన్నాయి.

కోడ్ ముగిసిన వెంటనే పనులు



టెండర్లు ఖరారు చేసి పూడిక తీత పనులు చేసేందుకు దృష్టి సారించాం. ఎన్నికల కోడ్ కారణంగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వెనుకంజ వేశారు. ఇంతలో ఎన్నికలు ముగిసేంత వరకు ఎలాంటి పనులు చేయొద్దని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. కాలువలో పూడికతీత పనులు చేయకపోతే ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు నీరు ప్రవహించడం కష్టమే.. కోడ్ ముగిసిన వెంటనే రూ.9 లక్షలతో గేట్లు లీకేజీ మరమ్మతులు పూర్తి చేస్తాం. సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బి.స్వామినాయుడు, ఇరిగేషన్ శాఖ, ఈఈ

సాక్షి మైత్రి మహిళ

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జూన్ 24వ తేదీ వరకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేయబడతాయి.

శిక్షణలో నేర్పించే అంశాలు :

1. త్రెడ్డింగ్, 2. వ్యాక్స్, 3 పెడిక్యూర్, 4. మెనిక్యూర్, 5. బ్లీచింగ్, 6. స్కిన్ కేర్, 7. హెయిర్ కేర్, 8. వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, 9. డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, 10. హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్, 11. హెయిర్ కట్స్, 12. హెయిర్ స్టైల్స్, 13. హెన్నా ప్రిపరేషన్ 14, డై అప్లికేషన్, 15. మేకప్స్ (బ్రైడల్, పార్టి మరియు లైట్ మేకప్స్) 16. పింపుల్ ట్రీట్‌మెంట్, 17. హెయిర్ మసాజ్, 18. కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, 19. ఫేషియల్స్, 20. సారీ డ్రాపింగ్.

రిజిస్ట్రేషన్స్ స్వీకరించు తేదీలు : 17-5-2024 నుంచి 26-5-2024 వరకు
సమయం : ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు
ఫీజు : 3000/-
వర్క్‌షాపు షెడ్యూలు తేదీలు : 27-05-2024 నుంచి 24-06-2024 వరకు
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

రిజిస్ట్రేషన్ మరియు శిక్షణా స్థలం :

వనితశ్రీ బ్యూటీ ఇన్‌స్టిట్యూట్
బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లేవ్, వేపగుంట, గోశాల, బి.ఆర్.టి.ఎస్.రోడ్, విశాఖపట్నం

సంప్రదించవలసిన నంబర్లు : 70757 09205, 91001 73200

క్లుప్తంగా

రసాయనాల వినియోగంతో పంటకు నష్టం



రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్న శాస్త్రవేత్త స్మైకాస్

రావికమతం: రసాయనాల వినియోగంతో పంటకు నష్టంతోపాటు భూసారం క్షీణిస్తుందని శాస్త్రవేత్త స్మైకాస్ తెలిపారు. గురువారం మత్స్యవానిపాలెంలో రైతుల చర్చాగోష్ఠి నిర్వహించారు. రైతులతోపాటు స్మైకాస్, మోషే వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల అనుభవాలను విద్యార్థినులు తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు, విద్యార్థినుల సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని శాస్త్రవేత్త స్మైకాస్ తెలిపారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో వ్యవసాయానికి సాంకేతికత జోడించే పలు ప్రాజెక్టుల నమూనాలను రైతులకు వివరించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.సత్తిబాబు, కిశోర్, శ్రీనిబాబు, వ్యవసాయాధికారి రూప, సర్పంచ్ మలిచెట్ల గణేష్, సత్తిబాబు, తాతబాబు పాల్గొన్నారు.

'ప్రత్యేక హోదాపై రాజకీయ పార్టీలు ఏకం కావాలి'

అనకాపల్లి: ఏపీకి ప్రత్యేక హోదాపై రాజకీయ పార్టీలు కలిసికట్టుగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ల్యాండ్ టైటిలింగ్ చట్టం, ప్రత్యేక హోదాపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు పరిపాలనా వ్యవస్థను ఆసరాగా చేసుకుని చట్టాలను తయారు చేస్తాయని, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నందున ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్ష జరపాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ 'కమర్షియల్' రికార్డ్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ కమర్షియల్ విభాగం సిబ్బంది ఏప్రిల్ నెలలో అత్యుత్తమ పనితీరు కనబరిచి, రికార్డు స్థాయి ఆదాయాన్ని సంపాదించారు. ఏప్రిల్ నెలలో వాల్తేర్ డివిజన్ కమర్షియల్ విభాగం చేపట్టిన 47,837 డ్రైవ్‌ల ద్వారా సుమారు రూ. 2.8కోట్లు ఆదాయాన్ని ఆర్జించగలిగారు. గత రికార్డులన్నీ అధిగమించి ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జోన్ పరిధిలోనే ఒక నెలలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన డివిజన్‌గా నూతన రికార్డు నెలకొల్పిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ సిబ్బందిని అభినందించారు.

అరకు కాఫీ.. MADE IN ANDHRA

దేశంలోని టాప్ కాఫీ బ్రాండ్స్‌లో ఒకటిగా ఎదిగిన అరకు కాఫీని.. ప్రజలకు అందించేందుకు గిరిజన సహకార సంస్థ కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఎప్పటికప్పుడు సరికొత్త ఫ్లేవర్స్‌లో కాఫీ ప్రియులకు అరకు కాఫీని పరిచయం చేస్తున్న జీసీసీ.. ఇకపై మేడిన్ ఆంధ్ర లేబుల్‌తో మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు డౌనూరులో రూ.3 కోట్ల వ్యయంతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను సిద్ధం చేస్తోంది.

- ఇప్పటివరకు బెంగళూరులో... ఇకపై డౌనూరులోనే తయారీ
- క్యూరింగ్, ప్యాకేజింగ్ మొత్తం ఇక్కడే..
- కాఫీ ప్రాసెసింగ్‌కు జీసీసీ సహకారం
- త్వరలోనే 'మేడిన్ ఆంధ్ర' పేరుతో కాఫీ సాచెట్స్, టిన్స్ విడుదల





సాక్షి, విశాఖపట్నం: సేంద్రియ పద్ధతుల్లో తయారయ్యే అరకు కాఫీ అంటే తెలియనివారంటూ ఉండరు. ఏజెన్సీలోని వాతావరణమే అరకు కాఫీ రుచికి ప్రధాన కారణం. ఇక్కడ పండే అరబికా రకం కాఫీ రుచికి పారిస్, జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ దేశాల్లోని నగరాల ప్రజలు సలాం కొట్టారు. అందుకే.. 2018లోనే బ్రెజిల్, సుమత్రా, కొలంబోతో పాటు ఇతర దేశాలను వెనక్కు నెట్టేసి ప్రిక్స్ ఎపిక్యూర్–2018 పోటీల్లో అరకు కాఫీ బంగారు పతకాన్ని సాధించింది. ఇలాంటి చరిత్ర ఉన్న అరకు కాఫీ ప్రాసెసింగ్ అంతా ఇకపై ఆంధ్రలోనే కానుంది.

సేంద్రియ విధానం వల్లే గిరాకీ..

అరకు కాఫీ టేస్టీగా ఉండటమే కాకుండా సేంద్రియ విధానంలో పండించడం వల్ల గిరాకీ సొంతం చేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 2.27 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ తోటల్లో ఏడాదికి 71,258 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో ప్రస్తుతానికి రెండు క్లస్టర్లలో 2,258.55 హెక్టార్ల విస్తీర్ణంలో ఆర్గానిక్ పద్ధతుల్లో కాఫీని పండిస్తున్నారు. చింతపల్లి క్లస్టర్ వరసగా మూడో ఏడాది కూడా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీవోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ తీసుకోగా.. జీకే వీధి క్లస్టర్ ఇప్పటికే రెండు సార్లు స్కోప్ సర్టిఫికెట్ దక్కించుకుంది. మూడో ఏడాదీ సేంద్రియ సాగుకు సంబంధించి స్కోప్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది.

2,600 మంది టాప్ గ్రేడ్ రకం సాగు..

ప్రస్తుతం కాఫీ గింజల క్యూరింగ్, ప్రాసెసింగ్ అంతా బెంగళూరులో జరుగుతోంది. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీతో టైఅప్ కారణంగా ప్రాసెసింగ్ వ్యయం పెరుగుతోంది. డౌనూరులో క్యూరింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభమైతే ఈ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. ఏజెన్సీలోని 11 మండలాల్లో 2,27,021 ఎకరాల విస్తీర్ణంలో కాఫీ తోటలున్నాయి. మొత్తం 93,521 మంది గిరిజనులు కాఫీ సాగులో పాల్గొంటున్నారు. వీరిలో 2,600 మంది రైతులు టాప్ గ్రేడ్ రకాన్ని సాగు చేస్తున్నారు. వీరి నుంచి సేకరించిన బీన్స్‌ని ఫిల్టర్ కాఫీ ఉత్పత్తి కోసం బెంగళూరుకు, ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్ ఉత్పత్తి, రిటైల్ మార్కెటింగ్‌కు ఏలూరు పంపిస్తుంటారు. ఇకపై ఇక్కడి నుంచే చేసేలా క్యూరింగ్ వ్యవస్థ సిద్ధమవుతోంది. త్వరలోనే మేడిన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో అరకు కాఫీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి రానున్నాయి.

కాఫీకి మార్కెటింగ్ సౌకర్యం

గిరిజన రైతుల జీవనోపాధి, ఆదాయ స్థాయిలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్ ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ అభివృద్ధికి ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు. పాడేరు ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల్లో సుమారు లక్షకు పైగా ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. గిరిజనులు పండించిన కాఫీకి జీసీసీ ద్వారా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఎన్నడూ లేని విధంగా గిరిజన రైతు పండించిన కాఫీని జీసీసీ భారీ మద్దతు ధరకు కొనుగోలు చేసింది. పార్చ్‌మెంట్ కాఫీ కిలోకి రూ.285, చెర్రీ కాఫీ కిలోకి రూ.145 మార్కెట్ ధరగా ప్రకటించి కొనుగోలు చేయడంతో మధ్యవర్తుల దోపిడీ ఆగింది. తద్వారా గిరిజనుల జీవనోపాధికి తగిన ఆదాయాన్ని ప్రభుత్వం జీసీసీ ద్వారా అందించింది. 2023–24లో ఇప్పటి వరకూ 564.48 మెట్రిక్ టన్నుల ముడి కాఫీని రైతుల నుంచి జీసీసీ కొనుగోలు చేసి రూ.13.39 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేసింది.

ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ఉపయోగాలివీ..

రాష్ట్ర ప్రభుత్వం నర్సీపట్నం సమీపంలోని డౌనూరులో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేసింది. 2023 అక్టోబర్ 20న ఈ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ యూనిట్ వద్ద గిరిజనులకు పెద్ద ఎత్తున లాభం కలగనుంది. జీసీసీ ముడి కాఫీని క్యూరింగ్ చేయడం నుంచి రోస్ట్ చేయడం, గ్రైండింగ్, బ్లెండింగ్, ప్యాకేజింగ్ మొదలైన అన్ని ఫీచర్లని ఇక్కడే నిర్వహించనుంది. దీని వల్ల కాఫీ క్యూరింగ్, తయారీ కోసం ఏపీఎఫ్‌డీసీ, ప్రైవేట్ పార్టీలపై ఆధారపడాల్సిన అవసరం లేదు. ఇది గిరిజన కాఫీ సాగుదారులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఎందుకంటే కాఫీ తయారీకి రవాణా, మొదలైన ఓవర్‌హెడ్ చార్జీలు తగ్గుతాయి. కాబట్టి గిరిజనులకు జీసీసీ మెరుగైన ధర చెల్లించే అవకాశాలు పెరుగుతాయి.

నాణ్యతలో నంబర్ వన్‌గా..



ఐదేళ్ల కాలంలో గిరిజనుల జీవితాల్లో జీసీసీ ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. కోవిడ్ సమయంలోనూ వారి ఉత్పత్తులను సేకరిస్తూ.. గిట్టుబాటు ధర కల్పిస్తూ.. అన్ని విధాలా చేదోడుగా నిలిచాం. అందుకే కరోనా సమయంలోనూ జీసీసీ టర్నోవర్ తగ్గలేదు. గిరిజనులు సేకరిస్తున్న అన్ని ఉత్పత్తులు నాణ్యతలో నంబర్‌వన్‌గా ఉన్నాయి. అందుకే తిరుమల తిరుపతి దేవస్థానానికి జీసీసీ ఉత్పత్తులు అందించే అవకాశాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించింది. జీసీసీ ఉత్పత్తులు తిరుమలలో వినియోగిస్తుండటం వల్ల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా గిరిజనులకు మరింత మేలు కలుగుతోంది. కాఫీ రేటుని ఒకేసారి రూ.120 అదనంగా పెంచాం. కాఫీ గింజలు సేకరించినప్పుడు గతంలో రెండు దఫాలుగా అంటే.. సీజన్ మొదట్లో, చివర్లో పేమెంట్ చేసేవారు. ఇకపై ఇక్కడే ప్రాసెసింగ్ జరిపే ప్రక్రియ ప్రారంభమైతే.. ఆంధ్రాలోనే తయారీతో పేరుతో కాఫీ ఉత్పత్తులను విడుదల చేస్తాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

చందనం విక్రయాలు ప్రారంభం



చందనం ప్యాకెట్లను అందజేస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై గురువారం నుంచి చందనం విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి ప్రసాద విక్రయశాలలోని కౌంటరులో సుమారు 10 గ్రాముల చందనం ప్యాకెట్‌ను రూ.10 చొప్పున విక్రయించారు. దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ పలువురు భక్తులకు ఈ ప్యాకెట్లను అందజేశారు. ఈ నెల 17, 19, 20, 21 తేదీల్లో మాత్రమే చందనం విక్రయిస్తారు. కాగా.. చందనం కొనుగోలు చేసేందుకు భక్తులు బారులుదీరారు.

అందుబాటులో శ్రీవారి అగరబత్తి



కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ తయారు చేసిన అగరబత్తులు అందుబాటులో ఉన్నాయి. ఆల్ ఇన్ వన్ కాంబో ప్యాక్ రూ. 475, అలాగే రూ.45, రూ.85 ధరలు గల అగరబత్తులు ఇక్కడ విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

22న సింహగిరిపై నృసింహ హోమం

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 22న పెద్ద ఎత్తున శ్రీ నృసింహ హోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ నెల 22న నృసింహ జయంతి, శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం కలిసి వచ్చాయని వివరించారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులను భాగస్వాములను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నృసింహ హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,500 టికెట్‌ను www.aptemples.ap.gov.inలో తీసుకుని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో కూడా టికెట్లు లభిస్తాయని వివరించారు.

కొత్త బస్సులతో ఖుషీ

- ఇటీవల ఆరు బస్సులు రాక
- త్వరలో మరో 40 వచ్చే అవకాశం
- వీటిలో సూపర్ లగ్జరీలు, అల్ట్రా డీలక్స్‌లు

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీలో కొత్త బస్సుల కోలాహలం నెలకొంది. పాత బస్సుల స్థానంలో వస్తున్న ఈ నయా బస్సులతో ఆర్టీసీ ఖుషీ ఖుషీగా ఉంది. పది లక్షల కిలోమీటర్లు, 15 ఏళ్లు తిరిగిన బస్సులను కాలం చెల్లిన జాబితాలో చేరుస్తారు. ఇలాంటి వాటిని తొలగించి వాటికి బదులు కొత్తవి సమకూరుస్తారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 40కి పైగా కాలం చెల్లిన బస్సులున్నాయి. దీంతో ఈ బస్సులు వివిధ రకాల శబ్దాలతో రోడ్లపై పరుగులు తీస్తూ ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటున్నాయి. కొన్ని బస్సుల్లో సీట్లు, కిటికీల అద్దాలు కూడా కండిషన్‌లో లేవు. బస్సు సస్పెన్షన్లు దెబ్బతిని కుదుపులకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వస్తున్న ఈ బస్సులు సరికొత్త డిజైన్లతో పాటు లోపల సీట్లు కూడా సౌకర్యవంతగా ఉంటున్నాయి. తొలుత ఇటీవల విశాఖకు ఆరు కొత్త బస్సులను కేటాయించారు. వీటిలో మూడు సూపర్ లగ్జరీలు, మూడు అల్ట్రా డీలక్స్‌లు ఉన్నాయి. త్వరలో మరో 40 వరకు కొత్త బస్సులు రానున్నాయి. ఇందులో 34 సూపర్ లగ్జరీలు, ఆరు డీలక్స్‌లు ఉండే అవకాశం ఉంది. వీటిని ప్రస్తుతం సర్దుబాటు చేసిన దూరప్రాంత రూట్లలోను, నాన్ స్టాప్ సర్వీసులుగాను నడుపుతారు.

కొత్త బాడీలతో సిటీ బస్సులుగా మార్పు..

మరోవైపు పది లక్షల కిలోమీటర్లు తిరిగిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ/అల్ట్రా డీలక్స్ బస్సులను సిటీ బస్సులుగా మార్పు చేయనున్నారు. ఇంజిను కండిషన్‌ను మెరుగు పరచడంతో పాటు చాసిస్‌లు బాగున్న బస్సులకు కొత్తగా బాడీలు కట్టించనున్నారు. విజయనగరంలోని జోనల్ వర్క్‌షాపులో ఈ బస్సుల మార్పు పనిని చేపట్టనున్నారు. ఇలా ఆర్టీసీ విశాఖ జిల్లాకు సంబంధించి 40–50 బస్సులను సిటీ బస్సులుగా మార్చనున్నారు.



కొత్త సూపర్ లగ్జరీ బస్సు

యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

కొమ్మాది: యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని, ఆలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పరివ్రాజక స్వామి పిలుపునిచ్చారు. సాగర్ నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. నేటి యువత ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండి రేపటి తరానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా విశాఖలో ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముందుగా ఆయన మందిరంలోని రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరేకృష్ణ మహా మంత్రంతో ఇస్కాన్ టెంపుల్ మార్మోగింది. ఈ సమావేశాల్లో ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ చైర్మన్ సుందర్ గోపాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులు https:// ignouadmission. samarth. edu. in/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు జూన్ 30 చివరి తేదీ అని, మరిన్ని వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Paramedical Science and Nursing Courses Admission open now Praveen Institute of Paramedical & sciences. Please Contact : M/s. S.R.Hospital, Near Rythu Bazar, Gopalapatnam, Vizag. Call : Mr. T.Srinivas, General Manager. Ph : 82979 52222 [V- 2536]

■ SBI లైఫ్‌లో అడ్వైజర్స్ / సేల్స్ మేనేజర్స్ M/F కావలెను. ఎక్స్‌ట్రా ఇన్‌కమ్ కొరకు. Rtd. Govt., Pvt. ఎంప్లాయిస్, బిజినెస్ పర్సన్స్, H.వైఫ్స్. 5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఫ్రీ. 90522 16662 [V- 2538]

■ Job Opportunity : A Fast growing Org. Shortly Opening New Branches in Vizag & Reqd. (1) Sr. Manager. (2) Field Officers. (3) PROs M/F Age : 30+ Yrly Pakage : 5-15 Lakhs (Gego) for Intrw. ✆ : 83415 15341, 95535 29529 [V-786860]

■ ఆప్తా హోమ్ కేర్ హైదరాబాద్ కేర్ టేకర్స్ కావలెను. జీతం:18–20వేలు, సంవత్సరం లోపు 22–25కి పెరిగే అవకాశం. 20–45లోపు M/F ఉచిత భోజనం వసతి 9492637091 [G-2427]

■ Branch Managers - MBA+ Exp. & Mark Executives - 8 / Receptionist / Tele Callers - 6, GLR Enterprises, Jagadamba (Tourism + Events + Placements) ✆ 73820 43258 [B-3482]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12047]

Wanted

■ VJA, మొగల్‌రాజపురంలోని ప్రముఖ హోమ్ హెల్త్‌కేర్ ఆఫీస్‌కి పెద్ద వారిని వారి ఇంటివద్దనే వుండి చూసుకొనుటకు నమ్మకమైన కేర్ టేకర్స్ M/F ఆయాలు, నర్సులు M/F కావలెను. ✆ 91608 35559, 98850 25559 [B-061]

■ ప్రముఖ బ్యూటీ సెలూన్ నందు పనిచేయుటకు 30 సంవత్సరాల లోపు గల ఫీమేల్ హెల్పర్స్ కావలెను. Qualification : Inter, Salary : 18,000/- అనుభవం అవసరంలేదు. ఫోన్ : 77801 53291 [V- 786872]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీ లించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

విద్యుత్ షాక్‌తో గాయపడ్డ వ్యక్తి



చికిత్స పొందుతున్న సత్తిబాబు

నర్సీపట్నం: స్థానిక మున్సిపాలిటీ బలిఘట్టానికి చెందిన దార్లపూడి సత్తిబాబు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గురువారం ఉదయం గ్రామంలోని మెయిన్ రోడ్డులో సెలూన్ షాపు వద్దకు వెళ్లాడు. అందరితో కలిసి పిచ్చాపాటిగా మాట్లాడుతూ షాపు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడం షాక్‌కు గురయ్యాడు. షాక్‌తో కొట్టుకుంటున్న సత్తిబాబును స్థానికులు రక్షించారు. ఉన్నపాటుగా కింద పడిపోవడంతో తలకు గాయమయింది. ఎర్త్ వైర్‌ను భూమిలో పాతిపెట్టకుండా స్తంభానికి చుట్టేసి వదిలేయడం వల్లే సత్తిబాబు విద్యుత్ షాక్‌కు గురైనట్లు స్థానికులు చెప్తున్నారు. విద్యుత్ సిబ్బంది నిర్వాకం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆక్షేపిస్తున్నారు. ప్రస్తుతం సత్తిబాబు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం



తీడ వద్ద ఏలేరు కాలువ నుంచి వెలికి తీసిన మృతదేహం

కోటవురట్ల: మండలంలోని తీడ గ్రామం వద్ద ఏలేరు కాలువలో దాదాపు 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం కనుగొని, వెలికి తీసినట్లు ఏఎస్‌ఐ కె.ఎ.దొర తెలిపారు. మృతుడు నలుపు రంగు ఫ్యాంటు, తెలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. అంతకు మించి మరే ఆధారాలు లేవని పేర్కొన్నారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వీఆర్‌వో మృతి

అనకాపల్లి: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండలంలోని మాకవరం వీఆర్‌వో బి.కృష్ణారావు గురువారం మృతిచెందినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. హెచ్‌సీ రామకృష్ణ కథనం మేరకు భీమునిపట్నం మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన బి.కృష్ణారావు(62) అనకాపల్లి మండలం మాకవరం వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. విధినిర్వహణలో భాగంగా గత నెల 29న అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో కార్యాలయం వద్ద ఫిట్స్ వచ్చి పడిపోయారు. దీంతో కృష్ణారావు తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్పి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మృతుడి అన్నయ్య పైడయ్యనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- ఐదుగురికి గాయాలు

కశింకోట: మండలంలోని నూతలగంటపాలెం వద్ద గురువారం లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. సీఐ ఎం.వి నోద్‌బాబు అందించిన వివరాలు. విజయవాడ నుంచి శ్రీకాకుళానికి 40 మంది ప్రయాణికులతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బయలుదేరింది. యలమంచిలి నుంచి అనకాపల్లి రహదారిలో నూతలగుంటపాలేనికి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ కనుమ్రి నాగమూర్తి, ప్రయాణికులు అనకాపల్లి మండలం శంకరానికి చెందిన ఎం.పెంటారావు, ఎం.ఈశ్వర్, గుడివాడ దరి చెంచుపేటకు చెందిన రేగాని కృష్ణ, ఆర్.అనూరాధలు గాయపడ్డారు. వీరిలో ఈశ్వర్, అనూరాధ, డ్రైవర్ నాగమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. మూర్తిని విశాఖపట్నం, మిగిలిన వారిని అనకాపల్లి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో బస్సు ముందు క్యాబిన్, ఇంజిన్ ప్రాంతం నుజ్జయింది. సంఘటనా స్థలాన్ని హైవే పోలీసులు సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రమాదంలో నుజ్జయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు భాగం

రోడ్డు ప్రమాదంలో యువ రైతు మృతి

- భార్యకు తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో కోలుకుంటున్న వైనం
- వంట్ల మామిడి వద్ద బైక్‌ను ఢీకొన్న వాహనం

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు చెందిన యువ రైతు గాడి పరసయ్య(42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్య రవణమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు. పాడేరు మోద కొండమ్మ పాదాల వద్ద గ్రామానికి చెందిన వ్యక్తి గురువారం మొక్కు తీర్చుకుని, వన భోజనాలు ఏర్పాటు చేశాడు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భార్యతో కలిసి పరసయ్య తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మాడుగుల మండలం వంట్లమామిడి దాటిన తర్వాత వెనక నుంచి వచ్చిన వాహనం పరసయ్య బైక్‌ను ఢీకొంది. బైక్‌తో పాటు రోడ్డుపై పడిపోయిన పరసయ్య మీదుగా ఆ వాహనం వెళ్లడంతో ఆయన కాలు నుజ్జయింది. తీవ్ర రక్తస్రావంతో సంఘటనా స్థలంలోనే పరసయ్య మృతి చెందాడు. వెనకాల కూర్చున్న భార్య రవణమ్మ వాహనం పైనుంచి తూలి పడి, తీవ్రంగా గాయపడ్డారు. ఆమె కుడి కాలు, కుడి చేయి విరిగిపోవడంతో స్థానికులు 108లో అనకాపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. ప్రమాదం జరిగిన పది నిమిషాలు వరకు పరసయ్య కొన ఊపిరితోనే ఉన్నాడు. భార్యాభర్తలిద్దరూ తీవ్ర గాయాలతో పైకి లేవలేక, మాట్లాడలేక అచేతనంగా పడి ఉండటాన్ని చూసిన స్థానికులు చలించిపోయారు. పరసయ్య మృతదేహాన్ని పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. వీరికి టెన్త్ పాసైన కుమాడు హర్షవర్దన్, 8వ తరగతి చదువుతున్న కుమార్తె హారిణి ఉన్నారు. ఉదయం పాడేరు వెళ్లి వస్తామని చెప్పిన తల్లిదండ్రుల్లో తండ్రి ఇక ఎప్పటికీ రాడని తెలిసిన పిల్లలు, కుటుంబ సభ్యుల రోదన స్థానికులను కన్నీరు పెట్టించింది. పరసయ్య ఆధునిక పద్ధతిలో పలు రకాల పంటలు పండిస్తూ స్థానిక రైతులకు ఆదర్శంగా నిలిచేవాడు. ఆధునిక విధానంలో పుచ్చకాయలు, బొప్పాయితో పాటు పలు రకాల కొత్త వంగడాలను తెచ్చి, ఈ ప్రాంత రైతులు సాగు చేసేలా ప్రోత్సహించేవాడు. వ్యవసాయంతో కలప అమ్మకాలు, కొనుగోలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ప్రమాద సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



సంఘటన స్థలంలో పరసయ్య బైక్, ప్రమాదానికి కారణమైన వాహనం



తీవ్ర గాయపడ్డ పరసయ్య భార్య రవణమ్మ



సంఘటన స్థలంలో మృతి చెందిన పరసయ్య మృతదేహం (ఇన్‌సెట్) పరసయ్య (ఫైల్)

క్లుప్తంగా

గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలు రేపు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో ఈ నెల 18న అనకాపల్లి గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పిచ్చుకల సంతతి పరిరక్షణలో భాగంగా ధాన్యపు కుంచెలు తయారీపై శిక్షణ ఉంటుందన్నారు. క్లబ్‌లో 75 వసంతాలు నిండిన పర్యావరణ హితులు, సమాజ చైతన్య వారధులకు వజ్రోత్సవ వేడుకల ఆత్మీయ సత్కారం, ఆటల పోటీలు, వివిధ రకాల పర్యావరణహిత స్టాల్స్ ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.25, టమాటా, బంగాళాదుంప రూ.30, బెండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, కాకరకాయ రూ.60, బీరకాయ రూ.80కి విక్రయాలు సాగాయి.

23న త్రిపురాంతక స్వామి కల్యాణం

కశింకోట: స్థానికంగా వెలసిన పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం(శివాలయం)లో ఈ నెల 23న స్వామి వారి 108వ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వి.బాబ్జీ, వి.కృష్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య కల్యాణం జరగనుందన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జూన్ 17న వేంకటేశుని కల్యాణోత్సవం

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో జూన్ 17న జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని 7వ వార్షిక కల్యాణ మహోత్సవాలను రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు సాయంత్రం 6 గంటలకు శ్రీనివాసుని కల్యాణోత్సవం, రెండవ రోజు గరుడోత్సవం జరపనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ

మునగపాక : మండల కేంద్రంలో గురువారం కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 392 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	5,200
రెండో రకం	3,810	4,300
మూడోరకం	3,300	3,740

అనకాపల్లి సినిమాలు

నటరత్నాలు	: రాజా
మిరల్	: సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ద ఏప్స్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
అపరిచితుడు	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 353 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 249 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

సొంత గూడులో పశు వైద్యశాల

నరసింగబిల్లి పశువైద్యశాల.. సొంత భవనం కోసం దశాబ్దంన్నరకు పైగా నిరీక్షించాల్సి వచ్చింది. అప్పటి పాలకులు అరకొర నిధులిచ్చి చేతులు దులిపేసుకున్నారు. దీంతో అసంపూర్తిగా మిగిలిన భవనం గురించి పట్టించుకున్న నాథుడే లేడు. పరిసర ప్రాంతాల పాడిరైతుల కష్టాలు తెలుసుకున్న ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పనులు పూర్తి చేసుకుని, పశువైద్య సేవలు అందిస్తోంది.



నరసింగబిల్లి పశువుల ఆస్పత్రి నూతన భవనం

- నరసింగబిల్లి పశు వైద్యశాలకు తీరిన అద్దె ఇక్కట్లు
- అందుబాటులో మెరుగైన పశువైద్య సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పరిసర గ్రామస్తులు





ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి పశు వైద్యశాలకు సుమారు దశాబ్దంన్నర తర్వాత సొంత భవనం సమకూరింది. వైద్య సేవలు మెరుగుపడ్డాయి. పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో 15 ఏళ్ల క్రితం సొంత భవనం కోసం ప్రభుత్వం రూ.7 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులు సరిపడక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆ తర్వాత దాని గురించి పాలకులతోపాటు ప్రజలూ మర్చిపోయారు.

నిర్మాణానికి ముందుకు రాక

2014లో హుద్‌హుద్ తుపాను నిధులు వచ్చినప్పటికీ, అవి కూడా అరకొరే కావడంతో ఎవరూ నిర్మాణం పూర్తి చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. ఈ నేపథ్యంలో పాత భవనం శిథిలావస్థకు చేరి, కూలిపోయేలా తయారయింది. దీంతో తాత్కాలికంగా పశు వైద్య కేంద్రాన్ని అక్కడి సామాజిక భవనంలోకి తరలించారు.

సరైన సదుపాయాల్లేక, జాతీయ రహదారిని దాటడం ప్రమాదకరంగా పరిణమించి పశువులకు వైద్య సేవలు సరిగా అందని పరిస్థితి. ఈ వైద్యశాల పరిధిలో నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, ఏఎస్ పేట, గొబ్బూరు, చింతలపాలెం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, సోమవరం తదితర గ్రామాలున్నాయి. వాటి పరిధిలో ఎక్కువ పశువులు ఉండటంతో వాటికి సేవలందించేందుకు ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు.

2017లో పశువుల ఆస్పత్రిగా..

గతంలో గ్రామీణ పశు వైద్య కేంద్రం ఉండేది. వెటర్నరీ అసిస్టెంట్ సేవలందించేవారు. దానిని 2017లో పశువుల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. పశు వైద్యాధికారి, అసిస్టెంట్లను నియమించారు. అయినప్పటికీ సొంత భవనం లేక వైద్య సేవలు సరిగా అందని పరిస్థితి. పాడి రైతులు ఇబ్బందుల్ని తెలుసుకున్న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో రూ.8 లక్షలు పంచాయతీ నిధులను కేటాయించారు. అసంపూర్తిగా ఉన్న పశు వైద్య కేంద్ర భవనాన్ని ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పూర్తిచేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఈ భవనంలోనే పశువైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. దీంతో పశువుల ఆస్పత్రికి వస్తున్న కేసుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది.

బెంగ తీరింది



పశువుల ఆస్పత్రికి సొంత భవనాన్ని నిర్మించి, అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉంది. గతంలో సామాజిక భవనంలో నిర్వహించే ఆస్పత్రికి వెళ్లాలంటే జాతీయ రహదారిని దాటాల్సి వచ్చేది. చాలాసార్లు పశువుల్ని తీసుకుని వెళ్లాలంటే వాహనాల రాకపోకలతో బెంగగా ఉండేది. ఇప్పుడు ఆ బెంగ లేదు. అన్ని రకాల పశు వైద్య సేవలూ అందుబాటులోకి వచ్చాయి.

-కశిరెడ్డి మాణిక్యాలరావు, పాడి రైతు, నరసింగబిల్లి.

పెరిగిన వైద్య సేవలు

పశువుల ఆస్పత్రికి సొంత భవనం సమకూరడంతో వైద్య సేవలు పెరిగాయి. రోజూ వచ్చే కేసుల సంఖ్య కూడా పెరిగింది. పాడి రైతులకు పశుపోషణలో మెలకువలందిస్తున్నాం. దీంతో తమ పాడి సంపదకు ఏ చిన్న సమస్య వచ్చినా పరిసర గ్రామాల ప్రజలు వాటిని తీసుకొచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. అత్యవసర పరిస్థితిలో పశువుల వద్దకు వెళ్లి మేమే అవసరమైన సేవలందిస్తున్నాం.

-చైతన్యమణి, పశువైద్యాధికారి, నరసింగబిల్లి పశువైద్య శాల

ఘనంగా డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ



తుమ్మపాల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు వాణీజగదీశ్వరి



కశింకోట పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ



డెంగ్యూ దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించవచ్చని తుమ్మపాల వైద్యురాలు వాణీజగదీశ్వరి తెలిపారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ పగటి వేళ కుడుతుందని, దీని ద్వారా డెంగ్యూ బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇంటి ముందున్న కాలువలో చెత్తాచెదారం వేయకూడదని, మురుగునీరు ఎల్లప్పుడూ దిగువ ప్రాంతానికి వెళ్లిపోయేలా చూడాలన్నారు. తాగునీటి కొళాయిల లీకేజీని అరికట్టాలని, ఎయిర్ కూలర్‌లోని నీటిని వారం వారం మార్చాలని, మురుగునీటి నిల్వలో వారానికోసారి కిరోసిన్ ఆయిల్, వాడిన ఇంజిన్ ఆయిల్ పిచికారీతో దోమల పుట్టుకను నియంత్రించవచ్చని సూచించారు. ఇంటి పరిసరాలలో పనికిరాని తొట్టెలు, డబ్బాలు, టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాల్లో వర్షపు నీరు చేరి దోమలు ఉత్పత్తి పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది డి.శారద, బి.సంఘం, బి.మాణిక్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో డెంగ్యూ నియంత్రణ

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది డెంగ్యూపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీలు చేశారు. కశింకోటలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో ×సమాజ భాగస్వామ్యం -డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం×నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి యు.రమేష్ నేతృత్వంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ నిల్వ నీరు ఉన్న చోట దోమలు గుడ్లు పెట్టి, వాటి సంతతిని అభివృద్ధి చేస్తాయని, అవి పెరగకుండా ఉండాలంటే ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల్ని నివారించవచ్చని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలని, ఇళ్లల్లో పొగబెట్టి దోమలను తరిమి కొట్టాలని పేర్కొన్నారు. జ్వరం వచ్చినప్పుడు రక్త పరీక్షలు చేసుకుని తగు చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఏవీ సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు నరసింహారావు, హెల్త్ విజిటర్ ఆర్.వెంకటలక్ష్మి, రెండు పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ధ్యాన మందిరం షెడ్ నిర్మాణ పనులు

కశింకోట: స్థానిక వేంకటేశ్వర ధ్యాన మందిరానికి నూతన సొబగులు సమకూరుస్తున్నారు. దాతల విరాళంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ మార్గంలో నీడ కోసం షెడ్ నిర్మాణం చేపట్టారు. ఇన్నాళ్లూ వర్షాకాలం, తీవ్ర ఎండలు ఉండే సమయంలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే భక్తులు ఇబ్బంది పడేవారు. షెడ్ నిర్మాణంతో భక్తుల కష్టాలు తీరనున్నాయి. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.



వేంకటేశ్వర ధ్యాన మందిరానికి ప్రదక్షిణ మార్గంలో చేపడుతున్న షెడ్ పనులు

పరవాడ ఓటింగ్ సరళిపై ఎమ్మెల్యేకు నివేదిక



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ఓటింగ్ సరళిని వివరిస్తున్న పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ : సార్వత్రిక ఎన్నికల్లో పరవాడ ప్రాంతంలోని పోలింగ్ సరళిని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు గురువారం వివరించారు. ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిసి బూత్‌ల వారీగా పోలైన ఓటింగ్ గురించి వివరించారు. ఓటింగ్ తీరును బట్టి వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని స్పష్టమవుతుందని శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు బొద్దపు చిన్నారావు, బొద్దపు శ్రీనివాసరావు, కంచిపాటి భాస్కర్, బొండా శ్రీనివాసరావు, శేష సురేష్ పాల్గొన్నారు.

ఉప్పు రైతులను ముంచిన అకాల వర్షం



వర్షానికి గట్లపై ఉన్న ఉప్పు కరిగిపోయిన దృశ్యం

పరవాడ : వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో సాగు చేస్తున్న ఉప్పుగల్లీలకు గురువారం తెల్లవారు జామున కురిసిన వర్షం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామంలో 150 ఎకరాల ఉప్పు పంట సాగవుతోంది. మడుల్లో పండిన ఉప్పును తీసి గట్లపై వేసి ఆ తర్వాత పాకల్లో నిల్వ చేద్దామనుకున్న తరుణంలో ఉన్నట్టుండి రాత్రి కుండపోతగా కురిసిన వర్షానికి ఉప్పు కరిగిపోయి నీటిపాలైందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వర్షం వెలిసిన తర్వాత వెళ్లి చూసి రైతులు కంట తడి పెట్టుకున్నారు. రూ. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండించిన ఉప్పు వర్షానికి నీటి పాలైందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన ఉప్పుకు సరైన గిట్టుబాటు ధర లేక ఇప్పటికే నానా అవస్థలు పడుతున్న తరుణంలో ఆకాల వర్షాలు తీరని నష్టం తెచ్చిపెట్టాయని రైతులు వాపోతున్నారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పు రైతులు కోరుతున్నారు.

గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం: అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం పుస్తక పఠనం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులు పుస్తకాలను చదివించే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తెలిపారు. పది మంది విద్యార్థులు పోటీ పరీక్షలు, జనరల్ నాలెడ్జ్, వర్తమాన అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివారు.

బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలి



గాయపడిన కార్మికుడిని ఆస్పత్రిలో పరామర్శిస్తున్న రాము

రాంబిల్లి : సింబయో ఫార్మా కంపెనీలో గాయపడిన కార్మికుడు కాజల్ బౌరి కి మెరుగైన వైద్య సేవలందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి ఈ కంపెనీలో రసాయనాలు పడి కార్మికుడు గాయపడడం జరిగిందన్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన అన్నారు. అధికారులు సక్రమంగా పరిశీలన చేయడం లేదని ఆరోపించారు. కాగా సింబయో పరిశ్రమలో జరిగిన ప్రమాదం సమాచారం గురువారం తెలిసిందని దీంతో సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ లక్ష్మణరావు విలేకరులకు తెలిపారు. అలాగే గాయపడిన కార్మికుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వాడని, ప్రస్తుతం అచ్యుతాపురంలో గల ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వర్షంతో ఉపశమనం



ఎన్టీఆర్ క్రీడామైదానం వద్ద వర్షంలో వాహనాలు



కశింకోటలో రోడ్డుపై వర్షపు నీరు

- పట్టణ పరిధిలో 10.5 మి.మీ. వర్షపాతం నమోదు

అనకాపల్లి: వేసవి ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న పట్టణ ప్రజలకు వర్షం కాస్త ఉపశమనాన్నిచ్చింది. వారం రోజులుగా పగటిపూట వేడి వాతావరణానికి జనాలు అల్లాడిపోతున్నారు. సాయంత్రానికి ఆకాశం మబ్బులు పట్టి, వాతావరణం చల్లబడటంతోపాటు అడపాదడపా కురిసే చినుకులకు ప్రజలు కాస్త సేదతీరుతున్నారు. గురువారం మాత్రం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చిరు జల్లులుగా మొదలైన వాన కాస్త ఎక్కువ సమయమే కురిసింది. పట్టణ పరిధిలో ఉదయం 8 గంటలకు మొదలైన వాన 10.30 గంటల వరకూ కొనసాగింది. దీంతో 10.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ వర్షం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే రైతులు, వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు, చిరువ్యాపారులు వారివారి కార్యకలాపాలకు వెళ్లే సమయంలో ఇబ్బంది పడ్డారు. మెట్ట ప్రాంత రైతులు మినుములు, పెసలు, చిరుధాన్యాల పంటలు వేసుకునేందుకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.

కశింకోట:మండలంలో గురువారం వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. వేసవి తాపంతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. చిన్నపాటిగా మొదలై మూడు గంటలు పైగా కురిసింది. పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. వర్షం చెరకు తోటలకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీపీసీలో స్వచ్ఛత పక్వాడ



ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లోని సవ్యాస్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ సింహాద్రిలో ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. 15 రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీజీఎం సీపీజీ-3 రష్మీ రంజన్ పరిధా, ఆపరేషన్ జీఎం సురేష్ జాన్ డేవిడ్, వీజీజీ జీఎం నోవాహు గడ్డం, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, జీఎంలు, ఇతర అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్న అర్చకులు



శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్సేణ అరాధన, పుణ్యావహవచనం, అంకురార్పణ, బుత్సంగ్రహణం, యాగాశాల అర్చన, అగ్ని ప్రతిష్ట జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడో రోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం జరగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు సాగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. తొలిరోజు పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు

యలమంచిలి రూరల్ : మండలంలోని రేగుపాలెంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకూ బారులు తీరారు.పలువురు మహిళా భక్తులు అమ్మవారికి చీర, రవికె, గాజులు పెట్టి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. పండగ సందర్భంగా హైవే కూడలి నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతర సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. గ్రామ సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, రాజాన శ్రీనివాసరావు,న్యాయవాది రాజాన గోవిందరావు, రాజాన మహాలక్ష్మీ శ్రీనివాస్,రాజాన కొండబాబు,రాజాన నానాజీ,రాజాన సురేష్,రాజాన కొండలరావు తదితరులు భక్తులకు ఇబ్బందులు లేకుండా పండగ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com